31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

గురువారం,ఆగస్టు 20 ,2026 పేజీలు : 8

## సిఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 19 :** సిఈఐఆర్ అప్లికేషన్ ను సద్వినియోగం చేసుకోవాలని, సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సిఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరి గురైన 102 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సిఈఐఆర్ వెబ్సైట్-మిగతా 2లో

# రూ.800 కోట్లతో చేపట్టిన మంథని రోడ్ల అభివృద్ధి పనులు

- పనులను 18 నెలల్లో పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రతి 15 రోజులకు మంథని రహదారి పనులపై సమీక్ష
- రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- కమాన్‌పూర్-మంథని నాలుగు లేన్ల రహదారికి రూ.200 కోట్లు మంజూరు చేసేందుకు సీఎం ఆమోదం తీసుకుంటాం
- మంథనిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, శ్రీధర్ బాబు









**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (జబ్బార్ ఖాన్ మంథని)ఆగస్టు 19 :** మంథని నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందని, గత రెండున్నరేళ్లలో సుమారు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని, ఈ పనులను 18 నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.మంథనిలోని గంగాపురి వద్ద రూ.20 కోట్లతో న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మంథని--రామగుండం నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు రూ.21 కోట్లు, ఇతర ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు రూ.97 కోట్లు, మంథని పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో బీటీ రోడ్లు, రూ.9 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు.మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో నాలుగు మండలాల లబ్ధిదారులకు రేషన్ (స్మార్ట్) కార్డులు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మైనార్టీలకు కుట్టుమిషన్లు, మహిళా స్వశక్తి సంఘాలకు చెక్కులను మంత్రులు పంపిణీ చేశారు.ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన మహనీయుడు పీవీ నరసింహారావు, అజాతశత్రువు దుద్దుల శ్రీపాదరావు ప్రాతినిధ్యం వహించిన మంథని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు మంథనికి రావడం సంతోషంగా ఉందన్నారు.మంథని నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.800 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. నల్గొండలో కూడా ఇంత భారీగా నిధులు మంజూరు కాలేదన్నారు. గోదావరి నదిపై హై లెవల్ బ్రిడ్జికి రూ.125 కోట్లు, బైపాస్ రహదారికి రూ.162 కోట్లు, హెచ్ ఏ ఎం రహదారులకు రూ.203 కోట్లు, మంథని--ఓడేడు రహదారికి రూ.60 కోట్లు తదితర పనులకు నిధులు మంజూరు చేశామని చెప్పారు.మంథని నియోజకవర్గంలోని అన్ని రహదారి పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రతి 15 రోజులకు మంథని రహదారి-మిగతా 2లో



### రేవంత్ ప్రభుత్వం ప్రైవేట్ లిమిటెడ్
# కంపెనీలా నడుస్తోంది

- సీఎం సామాజిక న్యాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదం
- బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 19 :** రేవంత్ ప్రభుత్వం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా నడుస్తోందని, సీఎం సామాజిక న్యాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ కార్యాలయంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అయినా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నడుపుతున్నారని ఆరోపించారు. ఛైర్మన్‌గా రేవంత్ రెడ్డి, డైరెక్టర్లుగా సీఎం అన్నదమ్ములు ఉన్నారని, వారి కనుసన్నల్లో హైదరాబాద్, రంగారెడ్డిలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని విమర్శించారు. ఉద్యమ ఫలితంగా తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. దశాబ్ద కాలంలో కుల -మిగతా 2లో

### ప్రజాసమస్యలు పరిష్కారం
# అయ్యే వరకు పర్యవేక్షణ

- ప్రజలతో ముఖాముఖి కార్యక్రమానికి విశేష స్పందన
- నాడు నిర్బంధాలు. నేడు ప్రజల వద్దకే పాలన
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 19.:** ప్రజా సమస్యలను నేరుగా విని, సత్వర పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మన్ కుమార్ స్పష్టం చేశారు.సమస్యల పరి ష్కారం కోసం కార్యాలయాలచుట్టూ ప్రజ లు తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రజ ల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు.బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమం లో మంత్రి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీక రించి సత్వర పరిష్కారం కోసం అధికా రులను ఆదేశించారు.అనంతరం విలేకరుల తో గాంధీభవన్‌లో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ముఖాముఖి కార్యక్రమంలో -మిగతా 2లో

## సిఈఐఆర్ అప్లికేషన్‌ను...

**మొదటి పేజీ తరువాయి...** ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సిఈఐఆర్ వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైళ్లను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్ లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందన్నారు. సిఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2024 (4.5 కోట్ల విలువగల ) ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారాల గురించి నష్టాన్ని కాజేస్తుందని, ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్లను నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సిఈఐఆర్ వెబ్సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎవరైనా సెకండ్ హాండ్ ఫోన్లు కొనే ముందు అప్లికేషన్లో ఆ ఫోన్ వివరాలను, ఐఎంఈఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలని తద్వారా ఆ ఫోన్ ఆ ఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుందన్నారు. అదేవిధంగా ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సిఈఐఆర్ టీం ను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడి కొట్టించి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వాటిపై అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడమే మంచిదని, ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు.

## రేవంత్ ప్రభుత్వం ప్రైవేట్ లిమిటెడ్....

**మొదటి పేజీ తరువాయి...**వృత్తులను ప్రోత్సహిస్తూ గొర్రెల పంపిణీ, గీత కార్మికులకు చెట్టు పన్ను రద్దు, మద్యం దుకాణాల్లో రిజర్వేషన్, రజకులు, నాయీ బ్రహ్మణులకు విద్యుత్ రాయితీ ఇచ్చారన్నారు. రైతు బంధు, రైతు బీమా ద్వారా రైతులకు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 58 ఏళ్లలో 261 గురుకులాలు ఉంటే, కేసీఆర్ 652 గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. బీసీ గురుకులాలు 19 నుండి 262కు, ఎస్సీ 134 నుండి 268కు, ఎస్టీ 96 నుండి 160కు, మైనారిటీ 12 నుండి 204కు పెంచారని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో బీసీ బాలురు, బాలికల గురుకులాలు తెచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. 33 నెలల్లో ఒక్క కొత్త రెసిడెన్షియల్ స్కూల్ కూడా ఏర్పాటు చేయలేదని నిలదీశారు. ఉన్న పాఠశాలలకు రంగులు వేసి తెలంగాణ మోడల్ స్కూల్ అంటున్నారని ఎద్దేవా చేశారు. 20 వేల కోట్ల కాంట్రాక్ట్ కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు తెస్తున్నారని, ఇదంతా కమీషన్ల కోసమేనని ఆరోపించారు. ఇతర ప్రాంతాల పాఠశాలలను తరలించి ఇంటిగ్రేటెడ్‌లో పెట్టడం దారుణమన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్ హామీ ఇచ్చిన కాంగ్రెస్, సర్వేలో దీజ జనాభాను 61శాతం నుండి 46 శాతంకు తగ్గించిందని మండిపడ్డారు. 5శాతం జనాభాను తగ్గించారని, బీసీ మంత్రులు రేవంత్ తలాడించినట్లు ఆడుతున్నారని విమర్శించారు. గురుకులాలను యథావిధిగా కొనసాగిస్తూ ఎక్కడికక్కడ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొత్త విద్యా విధానాన్ని బహిర్గతం చేయాలని, గురుకులాలు తరలిస్తే సహించబోమని హెచ్చరించారు. ఎస్టీ రిజర్వేషన్ 6శాతం నుండి 10 శాతం కు పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కనీసం ఆదర్శంగా తీసుకోవాలని, కేసీఆర్ పథకాలు గుర్తుకు వచ్చేందుకు కార్యాలయంలో ఆయన ఫోటో పెట్టుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు, మున్నా, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్, కల్లెపల్లి దుర్గయ్య, కోరుకంటి రాము, తోట హరీష్, శీలం ప్రవీణ్ కుమార్, నేహాల్, అతాఉల్లా, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి...**ప్రజలనుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చర్యలను పర్యవేక్షిస్తూ పరిష్కారంఅయ్యే వరకు సంబంధిత అధికారులను సమన్వయం చేస్తామని తెలిపారు. అత్యవసర సమస్యలకు సాధ్య మైనంత త్వరగా పరిష్కారంచూపిస్తూ మిగిలిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.ఎస్సీలు, గిరిజ నులు, దివ్యాంగులు,సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్లు, పేదలు, అణగారిన వర్గాలకు సంబంధించిన సమస్యల ను ప్రాధాన్యంతో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. 'ప్రజల వద్దకే పాలన' అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజల సమస్యలను వినడమే కాదుపరిష్కారం చూపడం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనే ప్రభుత్వ విధానమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.హౌస్ అరెస్టుల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు.

# రూ.800 కోట్లతో చేపట్టిన మంథని...

**మొదటి పేజీ తరువాయి...**పనులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలందరికీ డబుల్ రోడ్డు సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కమాన్‌పూర్ నుంచి మంథని మున్సిపాలిటీ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తీసుకుని, వచ్చే 15 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.గంగాపురి వద్ద నిర్మిస్తున్న చీరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మహిళలు, యువతకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి వివిధ కోర్సుల్లో శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం లభించడం సాధ్యం కాదని, ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందేందుకు యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి కూడా సుమారు రూ.200 కోట్ల పనులకు నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ పేరును సర్ ముసాయిదా జాబితాలో పరిశీలించుకోవాలని, ప్రతి ఓటు ముఖ్యమైనదేనని మంత్రి సూచించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కష్టకాలంలో కూడా మంథని ప్రజలు తమ వెంట ఉన్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులు మంజూరు చేయడం కూడా తక్కువేనని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిభావంతుడని, ఏ పనినైనా పూర్తి చేయగల సామర్థ్యం ఆయనకు ఉందన్నారు.దివంగత శ్రీపాదరావుతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని, శాసనసభ స్పీకర్‌గా ఆయన మంచి విలువలతో పనిచేశారని మంత్రి గుర్తు చేశారు. మంథని అభివృద్ధి కోసం ప్రతి ముఖ్యమంత్రి నుంచి నిధులు తీసుకురావడంలో శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారని తెలిపారు.మంథని నియోజకవర్గంలో మంజూరైన అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో నాణ్యతతో పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి సూచించారు. శ్రీధర్‌బాబుకు మంచి పేరు వచ్చేలా స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ రైతులు, మహిళలు, చేనేత కార్మికులకు అండగా నిలుస్తోందన్నారు. ఈ ఏడాది చిలకపచ్చ రంగులో నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించామని, రూ.1 లక్ష కోట్ల విలువైన పంటలను కొనుగోలు చేశామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంథని ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికై, కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు.మంథని ప్రాంతానికి గత రెండున్నరేళ్లలో సుమారు రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మంథని పట్టణంలోని బ్రిడ్జి నుంచి బస్ డిపో వరకు రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, మానేరు నదిపై కూడా వంతెన మంజూరైందని చెప్పారు. మంథని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.గోదావరి నదిపై హై లెవల్ బ్రిడ్జి, అవసరమైన రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, రహదారి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, కొత్త రేషన్ కార్డుల జారీ, పాత కార్డుల్లో కొత్త లబ్ధిదారుల చేరిక, డైట్ ఛార్జీల పెంపు, కాస్మెటిక్ ఛార్జీల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.గత పది సంవత్సరాల్లో పేదల గృహ నిర్మాణం నిర్లక్ష్యానికి గురైందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నామని చెప్పారు.మంథని ప్రాంతానికి పరిశ్రమలను తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించామని, కోకాకోలా వంటి బహుళజాతి సంస్థ మంథనిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. చిన్న సాఫ్ట్‌వేర్ కేంద్రం కూడా ప్రారంభమైందన్నారు.యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఏ టి సి, ఎన్ ఎ సి స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్ ఎ సి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.20 కోట్లు కేటాయించామని చెప్పారు. ఎనిమిది నెలల్లో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. అప్పటివరకు సెంట్రనరి కాలనీలో ఉన్న సింగరేణి భవనాలలో నాక్ కేంద్రం నడపాలని ఆయన సూచించారు.మంథని ప్రాంతంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని మంత్రి సూచించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, వరి సాగును తగ్గించాలని కోరారు. ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. నిధులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్యపై యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు యువత సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొని లాఠీచార్జీలను ఎదుర్కొన్నారని తెలిపారు. గతంలో నిరుద్యోగ సమస్యపై దృష్టి పెట్టని వారు ఇప్పుడు యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఏ టి సి, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఎంపీ తెలిపారు. యువత ఉద్యోగాలు కావాలా, కేసులు కావాలా అన్నది ఆలోచించి నిర్ణయించుకోవాలని సూచించారు.గత రెండేళ్లలో మణుగూరు--రామగుండం రైల్వే లైన్‌కు సుమారు రూ.4 వేల కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఇతర అభివృద్ధి పనులకు కూడా తన కృషితో సుమారు రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు.అనంతరం మంత్రులు వైకుంఠ రథాలను ప్రారంభించారు.

## ఓటర్ల జాబితాను సీరియల్ నంబర్, ఇంటి నంబర్ వారీగా ప్రచురించాలి



**కరీంనగర్, ఆగస్టు 16 (చురకలు ప్రతినిధి) :** కొన్ని ప్రాంతాలలో తమ వాస్తవ నివాస చిరునామాకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌కు బదులుగా, కొంతమంది ఓటర్లను ఇతర పోలింగ్ స్టేషన్లలో నమోదు చేసినట్లు మా దృష్టికి వచ్చింది.ఉదాహరణకు, హౌస్ నంబర్ 1-2-79లో నివసిస్తున్న ఓటరు పోలింగ్ కేంద్రాల నంబర్ 131లో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ర్గా నంబర్ 182లో ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా, హౌస్ నంబర్ 1-2-100కు సంబంధించిన ఓటరు పీఎస్ నంబర్ 132లో ఉండాల్సి ఉండగా, పీఎస్ నంబర్ 194లో ఉన్నట్లు సమాచారం. ఇలాంటి విధంగా ఓటర్లు ఇతర పోలింగ్ స్టేషన్లలో నమోదు కావడం వల్ల ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా, ఎన్నికల సమయంలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది.ఓటర్ల జాబితాను సీరియల్ నంబర్ మరియు ఇంటి నంబర్ వారీగా స్పష్టంగా మరియు క్రమబద్ధంగా ప్రచురించకపోతే, ప్రజలకు మరియు ఎన్నికల అధికారులకు సరైన ఓటర్లను గుర్తించడం, వారి వివరాలను పరిశీలించడం కష్టమవుతుంది. దీనివల్ల నిజమైన ఓటర్ల విషయంలో అనవసరమైన అభ్యంతరాలు మరియు గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది.ఓటర్ల జాబితాను సీరియల్ నంబర్ మరియు ఇంటి నంబర్ వారీగా క్రమబద్ధంగా ప్రచురించవలసిందిగా కోరుతున్నాను.ప్రతి ఓటరును వారు వాస్తవంగా నివసిస్తున్న ఇంటి/నివాస ప్రాంతానికి సంబంధించిన సరైన పోలింగ్ స్టేషన్‌లో నమోదు చేయవలసిందిగా కోరుతున్నాను.తప్పుగా ఇతర పోలింగ్ స్టేషన్లకు కేటాయించబడినట్లు కనిపిస్తున్న ఓటర్ల వివరాలను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.ఓటర్ల తుది జాబితా ప్రచురించే ముందు అవసరమైన సవరణలు మరియు మార్పులు చేసి, నిజమైన ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడవలసిందిగా కోరుతున్నాను.కాబట్టి, పై విషయాన్ని దయచేసి పరిశీలించి, న్యాయమైన, పారదర్శకమైన, ఖచ్చితమైన మరియు ఎలాంటి పొరపాట్లు లేని ఎన్నికల ప్రక్రియ కోసం అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. ఈకార్యక్రమంలో మొహమ్మద్ అమైర్ కలిసీ వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఆటబొమ్మల పంపిణీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు19 :** కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల గడి ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు ఆటబొమ్మలను మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేష్ గడి ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌లతో కలిసి చైర్‌పర్సన్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఆటబొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,19 :** కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కథలాపూర్ మండలం సిరికొండ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గంగాధర్ తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం మాదాపూర్‌లోని గంగాధర్ స్వగృహానికి వెళ్లిన కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, గంగాధర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు చేపూరి కృష్ణారెడ్డి, పడాల లచ్చన్న, తోడేటి శంకర్, జమున, నాయిని ప్రసాద్, ఎడ్ల గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కల పంపిణీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,19 :** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని 9వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఎడ్ల జలజ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎడ్ల జలజ రమేష్ మాట్లాడుతూ చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పచ్చదనం పెరిగితే వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల రమేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 19 :** జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ (వర్తక సంఘం) ఎన్నికల ప్రక్రియ బుధవారం ఏకగ్రీవంగా పూర్తయ్యింది. రెండోసారి చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులుగా కమటాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈనెల 15న వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం బుధవారం నామినేషన్ల స్క్రూటీని చేపట్టగా, ప్రకటించిన 5 పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. వాటిని పరిశీలించిన అనంతరం సంబంధిత అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ధృవీకరణ పత్రాలు అందజేశారు. అధ్యక్షులుగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శి గా సామ సునీల్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎన్నికల కన్వీనర్ పల్లెల రాజయ్య, ఎన్నికల అధికారి పబ్బ శ్రీనివాస్, ఉప ఎన్నికల అధికారులు శ్రీనివాసమూర్తి, పాత సుధాకర్ అభినందించి, సన్మానించారు. ఏకగ్రీవ ఎన్నిక జగిత్యాల పట్టణంలోని ఇతర సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఇది సభ్యుల ఐకమత్యానికి, సంఘ బలోపేతానికి నిదర్శనమని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. రాబోయే రోజుల్లో సంఘ సభ్యుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. అనుబంధ సంఘాల ఆలోచనల మేరకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి, త్వరలో నూతన కార్యవర్గ పరిచయ వేదికను నిర్వహిస్తామని వారు తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం

### ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 19 :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ధర్మపురి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిత్యం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం యూనిఫాంలను పంపిణీ మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి పారిశుధ్య కార్మికులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సంక్షేమానికి పురపాలక సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పారిశుధ్య కార్మికులు యూనిఫాంలను సద్వినియోగం చేసుకుని విధుల్లో భాగంగా తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతతో పాటు కార్మికుల భద్రత, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ తెలిపారు. అంతకుముందు 9వ వార్డు కోరండ్ల పల్లె లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు సంఘనబట్ల సంతోషి, అయ్యోరి వేణుగోపాల్, చిపిరిశెట్టి రాజేష్, సంగి ఆనంద్, విజయ్, సువర్ణ, ఒజ్జల లక్ష్మణ్, సంధ్య, నాగలక్ష్మి, కోఅప్షన్ సభ్యులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఆగస్టు 19 :** ఏడు ప్రాధాన్య వరి రకాల విత్తనాలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా విత్తనాల నమోదు చేసుకోవాలని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయధికారి దీపిక అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ వ్యవసాయం చేపడుతున్న రైతుల పంట పొలాలని మండల వ్యవసాయధికారి అధికారి దీపిక రైతులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూరగాయలు మరియు వరి పొలాలని పరిశీలించి రైతులకి పలు సూచనలు తెలియజేస్తూ, వానాకాలం - 2026లో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు ప్రాధాన్య వరి రకాల విత్తనాలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా విత్తనాల నమోదు సెప్టెంబర్ 10 లోపు చేసుకోవాలని సూచించారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాల విత్తనాలకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద పాస్బుక్, మొబైల్ నంబర్, విత్తన రకం, బ్యాగుల సంఖ్య వివరాలను నమోదు చేసుకోవాలని అనంతరం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా నిర్లక్ష్యం చేయకుండా టి-ఆగ్రి సీడ్స్ పోర్టల్లో విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

# బీఆర్ఎస్ జెండా గద్దెను తిరిగి నిర్మించాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 19 :** జగిత్యాల పట్టణంలోని 12వ వార్డులో రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించిన బీఆర్ఎస్ జెండా గద్దెను తిరిగి నిర్మించాలని మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము అభివృద్ధి పనులకు వ్యతిరేకం కాదని, కానీ పార్టీ జెండా గద్దెను తొలగించడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ జెండాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అక్కడ ఉన్న కాంట్రాక్టర్కు, ఏఈలకు స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పడిగేలా గంగారెడ్డి, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు

**-కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**





**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 19 :** ప్రపంచ 187వ ఫోటోగ్రఫీ డే సందర్భంగా కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంఘం సూచనలు ఆదేశాల మేరకు తోటి ఫోటోగ్రాఫర్లు వీడియోగ్రాఫర్లతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన లూయిస్ డాగురేను స్మరించుకుంటూ కేక్ కట్ చేశారు. అనంతరం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు స్లేట్లు అందజేశారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచ ఫోటోగ్రఫీ డేను జరుపుకోవడం ఆనందంగా ఉందని క్లబ్ సభ్యులు తెలిపారు. ఫోటోగ్రాఫర్లు వీడియోగ్రాఫర్లు సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కెమెరా క్లబ్ అధ్యక్షుడు తడుక సత్యనారాయణ, కార్యదర్శి భారతాల నరేందర్, కోశాధికారి నారవేణి విజయ్‌తో పాటు వినోద్, శంకర్, దత్తు, రాజేందర్, షోయబ్, మధు, అజయ్, సురేష్, రాజు, ప్రతాప్, సాయి కృష్ణ, సతీష్, సురేందర్, రమేష్, ప్రవీణ్, అనిల్, నరేష్, మహేష్, శ్యామ్, మురళి, రిషి, రితిక్ తదితర కెమెరా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ప్రభుత్వ పతనం తప్పదు

**-పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయొద్దు**

**-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు : కసిరెడ్డి మణికంఠ రెడ్డి**




**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 19 :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జగిత్యాల జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు సమీర్ అధ్యక్షతన బుధవారం కోరుట్లలోని ప్రభాకర్ భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ మొత్తాన్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం తో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు కళాశాలలకు సొంత డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత మూడు సంవత్సరా లుగా ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే విద్యార్థులు ఉన్నత చదువులు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్యా వ్యవస్థ నిర్వీర్యమవు తుందని మణికంఠ రెడ్డి అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగానికి నష్టం కలిగిస్తోందని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించు కోవాలని డిమాండ్ చేశారు. శక్తి పాలసీని వెంటనే వెనక్కి తీసుకోవాలని జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తగ్గించడం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇతర కార్యక్రమాలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్లను పరిష్కరించక పోతే విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సమీర్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద రాకేష్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గని మనోజ్ ముజీబ్ రాజీవ్‌విష్ణు తేజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**-ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగష్టు (19) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల యూనియన్ ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల యూనియన్ ఏర్పాటు అనంతరం సంఘం జెండాను మొదటిసారిగా ఆవిష్కరించడం విశేషం గా నిలిచింది. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫర్లు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ప్రతి ముఖ్యమైన సంఘ టనను చిత్రాల రూపంలో భద్రపరచడం లో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కాలంతో పాటు ఫోటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, ప్రజలకు వాస్త వాలను చిత్రాల ద్వారా అందించడంలో ఫోటోగ్రాఫర్లు తమ సేవలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘం ఐక్యంగా పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా డైరెక్టర్ క్యాతం రాజ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పసునూరి సురేందర్, క్యాషియర్ బండారి రాఘవేందర్, కోశాధికారి మర్రిపెల్లి మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఇసపెల్లి నరేష్, జిల్లా డైరెక్టర్ రెడ్డవెన లక్ష్మీ నర్సయ్య ఫోటో గ్రాఫర్స్ మహేష్, శివ, వేణు, ప్రకాష్, శ్రీకాంత్, రాజేష్, దీపక్, ప్రదీప్, అరుణ్, లింగమయ్య, రంజిత్ కుమార్, అక్షయ్ కుమార్, అజయ్, వంశీ, గణేష్, సునీల్, సుభాష్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 19 :** ధర్మపురిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల ను బుధవారం ఘనంగా నిర్వహించారు . ధర్మపురి పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు ధర్మపురి - బీర్పూర్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ..సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా, నాటి జ్ఞాపకాలను, చారిత్రక ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే ఒక గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో, ప్రభుత్వ కార్యక్రమా లను ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్లు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఎండ, వానలను లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న ఫోటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు యూనియన్ తరపున కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లందరికీ శు భాకాంక్షలు తెలియజేస్తూ, ఫోటోగ్రఫీ రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు అయ్యోరి సత్యం, గౌరవ అధ్యక్షులు రేచవేని శ్రీనివాస్, కుటుంబ భరోసా ఇంచార్జ్ మెరుగు రమేష్, జిల్లా డైరెక్టర్ వేముల రమేష్, మెండు హరీష్, దాసరి చంద్రశేఖర్, బొమ్మిడి సుమన్, బెతి రమేష్, సుమన్, సంతోష్, రమేష్, ధర్మపురి బీర్పూర్ యూనియన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనాథలైన చిన్నారులకు ఆర్థిక సాయం

**-చిన్నారులను పరామర్శించి రూపాయలు లక్ష 1,20 వేలు అందచేత**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అగష్టు (19) :** తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన నలుగురు చిన్నారులకు గ్రామానికి చెందిన సేవాభావం కలిగిన పలువురు అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన జవ్వాజి శ్రీనివాస్ ఇటీవల దుబాయిలో మృతి చెందారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు తల్లిదండ్రుల ఆదరణకు దూరమయ్యారు .విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన సేవాభావం కలిగిన వ్యక్తులు మానవతా దృక్పథంతో స్పందించి నలుగురు చిన్నారుల కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. అందరూ కలిసి బుధవారం రూపాయలు 1,20 వేలు సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. చిన్నారుల విద్య, ఇతర అవసరాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఇక్కడ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, యువకులు నేమూరి నరేష్, పాశం విపుల్, నాయకులు మార బుచ్చన్న, జవ్వాజి రాకేష్ తదితరులు ఉన్నారు.

# ఓబీ మట్టి రవాణాతో రూ.40 లక్షల రోడ్డు ధ్వంసం

**-సింగరేణి నిధులతోనే మళ్లీ మరమ్మతులా?**
**-ఓవర్‌లోడ్ వోల్వో లారీలపై చర్యలు తీసుకోవాలి**
**- ఓబీ మట్టి తరలింపుపై సమగ్ర విచారణ జరపాలి**
**-కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి ఫిర్యాదు చేస్తాం: బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 19 :** సింగరేణి ఆర్‌జీ-3 పరిధి నుంచి ఓబీ మట్టిని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి తరలించేందుకు భారీ వాహనాలను ఉపయోగించడంతో పన్నూరు సెంటర్ నుంచి ఏఎల్‌పీ మైన్, జీఎం కార్యాలయం, జేఎన్‌టీయూ యూనివర్సిటీ, వి.టి.సి. ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ ఆరోపించారు.ఓబీ మట్టి తరలింపులో ఓవర్‌లోడ్ వోల్వో లారీలు ఇష్టారాజ్యంగా తిరగడం వల్లే రోడ్డు దెబ్బతిన్నదని కార్మికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారి కొద్దికాలంలోనే తీవ్రంగా దెబ్బతినడం పట్ల సమగ్ర విచారణ అవసరమన్నారు. కార్మికుడి కాలు కోల్పోయిన ఘటనపై కూడా బాధ్యత ఎవరిది?ఈ మార్గంలో లారీలు, భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఒక సింగరేణి కార్మికుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయిన ఘటన కూడా జరిగిందని శ్రీనివాస్ తెలిపారు.ప్రతిరోజూ సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, ఏఎల్‌పీ మైన్‌కు వెళ్లే ఉద్యోగులు, జీఎం కార్యాలయానికి వెళ్లే అధికారులు, జేఎన్‌టీయూ యూనివర్సిటీ విద్యార్థులు, వి.టి.సి.కి వెళ్లే శిక్షణార్థులు ఈ రహదారిని వినియోగిస్తున్నారని చెప్పారు.ఇంత కీలకమైన రహదారిపై భద్రతా ప్రమాణాలను ఎందుకు నిర్లక్ష్యం చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.“మట్టి వాళ్లు వాడుకుంటారు – రోడ్డు కూడా వాళ్లే వేసి అప్పగిస్తారు” అని గతంలో చెప్పిన అధికారులుఓబీ మట్టిని తరలించేందుకు అనుమతి ఎవరు ఇచ్చారు? ఏ ఉత్తర్వులు, ఏ ఒప్పందం, ఏనిబంధనల ప్రకారం అనుమతించారు ? వాహనాలకు ఎంత పరిమాణంలో మట్టి తరలించేందుకు అనుమతి ఉంది? ఓవర్‌లోడ్‌ను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలను గతంలో సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు, గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించిన మెగా కంపెనీ, పీడీఆర్ తదితర సంస్థలు మట్టిని వినియోగించుకుంటాయని, రోడ్డు దెబ్బతిన్న తర్వాత వారే రోడ్డు పునర్నిర్మించి సింగరేణికి అప్పగిస్తారని అధికారులు చెప్పారని శ్రీనివాస్ తెలిపారు.అయితే ప్రస్తుతం అదే రహదారిని సింగరేణి యాజమాన్యం లక్షల రూపాయల ప్రజా/కంపెనీ నిధులతో మరమ్మతులు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. నిబంధనల ప్రకారం రికార్డులు బయటపెట్టాలి.తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్, 1966లో ఖనిజాల రవాణాకు అనుమతులు, డిస్పాచ్ పర్మిట్లు, పరిమాణం, తనిఖీలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. అలాగే MMDR Act, 1957లో ఖనిజ రవాణాను నియంత్రించడం,వెయ్ బ్రిడ్జిలు,చెక్‌పోస్టులు,తనిఖీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయి.కాబట్టి ఆర్‌జీ-3 నుంచి ఓబీ మట్టి తరలింపుకు సంబంధించి ఎవరు అనుమతి ఇచ్చారు ?ఏ ఉత్తర్వు/ఒప్పందం ప్రకారం అనుమతి ఇచ్చారు?ఎంత పరిమాణం ఓబీ మట్టి తరలించేందుకు అనుమతించారు?ఎన్ని వాహనాలు, ఎన్ని ట్రిప్పులు తిరిగాయి?వాహనాల బరువును ఎక్కడ,ఎలా తనిఖీ చేశారు? ఓవర్‌లోడ్ వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?రోడ్డు మరమ్మతుల బాధ్యత కాంట్రాక్టర్‌దా, సింగరేణిదా?రోడ్డు నిర్మాణానికి ప్రస్తుతం సింగరేణి ఎంత మొత్తాన్ని ఖర్చు చేస్తోంది?గతంలో “రోడ్డు మేమే వేసి అప్పగిస్తాం” అని చెప్పిన సంస్థలతో ఒప్పందం ఏమిటి?ఇప్పటి వరకు ఓబీ మట్టి తరలింపు ద్వారా సింగరేణికి/ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం లేదా ప్రయోజనం ఎంత?అనే వివరాలను సింగరేణి యాజమాన్యం ప్రజల ముందు ఉంచాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.కార్మిక సంక్షేమానికి డబ్బులు లేవంటూ – ప్రైవేట్ కాంట్రాక్టర్లకు మాత్రం కోట్ల విలువైన పనులా? సింగరేణి కార్మికులు రక్తం చిందించి,చెమటోడ్చి కంపెనీని అభివృద్ధిలోకి తీసుకొస్తున్నారని, కానీ కార్మికుల నివాస ప్రాంతాల్లో వర్షాలకు ఇళ్లు కారుతున్నా పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ విమర్శించారు. తలుపులు, డ్రైనేజీలు, రోడ్లు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక సదుపాయాల విషయంలో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఒకవైపు కార్మిక సంక్షేమానికి నిధుల కొరత ఉందని చెప్పడం, మరోవైపు ప్రైవేట్ కాంట్రాక్టర్లకు సంబంధించిన పనుల్లో సింగరేణి నిధులు ఖర్చు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.కార్మికులకు అన్యాయం – ప్రైవేట్ కాంట్రాక్టర్లకు న్యాయం చేసే విధానాన్ని బీజేపీ సహించదని ఆయన హెచ్చరించారు.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం**

ఆర్‌జీ-3 ఓబీ మట్టి తరలింపు, భారీ వాహనాల రాకపోకలు, రోడ్డు నిర్మాణం-మరమ్మతులపై ఖర్చు, కాంట్రాక్టు నిబంధనలు, ప్రమాదాలు తదితర అంశాలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి దృష్టికి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని మొలుమూరి శ్రీనివాస్ తెలిపారు. అవసరమైతే సంబంధిత కేంద్ర, రాష్ట్ర శాఖల ద్వారా సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ప్రజల భద్రత, కంపెనీ నిధుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని మొలుమూరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. కేంద్ర విజిలెన్స్ కు ఫిర్యాదు చేస్తాం మరియు సింగరేణి కంపెనీలో ఉన్న విజిలెన్స్ అధికారులు పనిచేస్తున్నారా కంపెనీకి నష్టం చేసిన అధికారుల పైన చర్యలు చేతుకోరా కార్మిక కుటుంబాల కు అన్యాయం చేస్తారా కార్మిక కుటుంబాల ఉసురు మీకు తగులుతుంది జాగ్రత్త...

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్ దినోత్సవ వేడుకలు




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (రామగిరి) ఆగస్టు 19 :** రామగిరి మండలంలోనిలయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ డైరెక్టర్, సీనియర్ జర్నలిస్ట్ లయన్ జబ్బర్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జబ్బర్ ఖాన్ మాట్లాడుతూ ... విలేకరులు మరియు ఫోటోగ్రాఫర్లు తీసే ప్రతి ఫోటో ఒక సంఘటనకు సాక్ష్యంగా నిలుస్తుందని, ఒక వార్తను ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమయ్యేలా చేయడంలో ఫోటోకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఒక మంచి ఫోటోలో ఒక సంఘటనకు సంబంధించిన ఎన్నో విషయాలు కనిపిస్తాయని, సమాజంలో జరుగుతున్న మంచి, చెడు విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో ఫోటోలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు డా శరణ్య యాదవ్ మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందిస్తున్న ఫోటోగ్రాఫర్లు, జర్నలిస్టుల సేవలను అభినందించారు. “ఒక ఫోటో వెయ్యి మాటలతో సమానం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ మేకల మారుతి యాదవ్, కార్యదర్శి కాటం సత్యం, ఉపాధ్యక్షులు బుర్ధర్తి బుచ్చన్న,క్లబ్ చైర్మన్ లు మొల్మూరి శ్రీనివాస్,గంట వెంకటరమణ రెడ్డి,గుండా శ్రీనివాస్, క్లబ్ మహిళా చైర్మన్ లు పట్నం వసుంధర,మర్రి శరణ్య, మాచర్ల లావణ్య పాల్గొన్నారు.



## బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌ని కలిసిన దుమాల గ్రామ గ్రంథాలయ చైర్మన్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 19 :** బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ని దుమాల గ్రామ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల బాలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు (జశీఎజూవ్‌ఙఅజవ జుఇఖఎం) సిద్ధమయ్యే విద్యార్థుల కోసం విలువైన పుస్తకాలను దుమాల గ్రామ గ్రంథాలయానికి అందజేయడం జరిగింది.విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమారపు శరవింద్, ఏజీపీ కృష్ణ, మాజీ సర్పంచ్ రజిత శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పొన్నం బాలకిషన్ గౌడ్, చెట్కూరి బాలాగౌడ్ పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న మహమ్మద్ షాదుల్





**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డి పేట ఆగస్టు 19 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సింధు ఫోటో స్టూడియో ఫోటో గ్రాఫర్ మహమ్మద్ షాదుల్ తీసిన ఫోటోకు ఉత్తమ అవార్డును అందుకున్నారు.ఉత్తమ అవార్డు అందుకున్న ఫోటోగ్రాఫర్ షాదుల్‌ను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ,స్థానిక సర్పంచ్ ఎలగందుల నర్సింలు విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల కరస్పాండెంట్ మహమ్మద్ లతీఫ్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి,లు అభినందించారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 19 :** ఫోటో,వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగెం మోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఫోటోగ్రాఫిక్ జెండాను ఆవిష్కరించి,అలాగే కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్ఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను ఫోటో, వీడియో రూపంలో భద్రపరుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సేవలను కొనియాడారు.గౌరవ అధ్యక్షులు ఏలే కుమారస్వామి, ఉపాధ్యక్షులు బాలసాని దేవరాజ్,విభూది అశోక్ , ప్రధాన కార్యదర్శి కళ్యాణం రాజు, కార్యదర్శి గాజుల ప్రవీణ్, జిల్లా ఫోటోగ్రఫీ కమిటీ ఉపాధ్యక్షుడు తాటిపాముల శ్రీనివాస్,జిల్లా కమిటీ సభ్యులు సంగెం సునీల్,కుటుంబ భరోసా ఇంచార్జ్ కర్రె నాని, ఫోటోగ్రాఫర్లు గంజి భాస్కర్, కంకల సంతోష్, సబ్బని శ్యామ్, సందీప్, శ్రీనివాస్, సాయి, షఫీ,సుమన్, బొమ్మ పవన్, సాయి సాగర్,చందు,అభిలాష్, శ్రీకాంత్,సుమన్ లు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అభినందించిన సి ఐ



**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డి పేట ఆగస్టు 19 :** ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ ఓ.వెంకటేష్,ఎస్సై ఎన్.రమేష్ సిబ్బంది అభినందించారు.

## వేములవాడలో అక్రమ సంబంధంతో పట్టుబడిన జానపద కళాకారులు



**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల ఆగస్టు 19 :** వేములవాడ అర్బన్ లోని నంది కమాన్ వద్ద గల ఓ కుల సంఘ భవన్‌లో మంగళవారం ఉదయం తీవ్ర కలకలం రేగింది. ప్రముఖ జానపద పాటల కళాకారులుగా పేరుపొందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ సంబంధం నడుపుతున్నారనే ఆరోపణలతో రెడ్ హ్యాండెడ్ గా చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న సదరు వ్యక్తి భార్య అక్కడికి చేరుకుని, వారిద్దరిని నిలదీసింది. వివాహేతర సంబంధంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానికుల ఎదుట ఆందోళన చేపట్టింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గ్రామస్తుల ధర్నా ఫలితం.. పోతిరెడ్డిపల్లి రోడ్డుకు మరమ్మతులు



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 19 :** వీణవంక మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు గత రెండు రోజులుగా ఇసుక క్వారీ ఎదుట నిర్వహించిన ధర్నా, రాస్తారోకోకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామ ప్రజల ఆందోళనకు క్వారీ యాజమాన్యం దిగివచ్చి సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చింది.ఇసుక క్వారీ వాహనాల రాకపోకలతో రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో పోతిరెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు కలిసి రెండు రోజులుగా ఆందోళన చేపట్టారు.దీనిపై స్పందించిన క్వారీ యాజమాన్యం పోతిరెడ్డిపల్లి--హిమ్మత్‌నగర్ రహదారి మరమ్మతు పనులను ప్రారంభించింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు దెబ్బతిన్న ప్రాంతాలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తామని క్వారీ యాజమాన్యం హామీ ఇచ్చింది. రెండు రోజుల్లో పనులు పూర్తిచేస్తామని తెలిపారు.ప్రజల ఆందోళనకు స్పందించి రహదారి మరమ్మతులకు ముందుకు రావడంపై గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన క్వారీ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా కళాకారుల సమస్యలపై మున్సిపల్ వైస్ చైర్మన్‌కు వినతి

**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగస్టు, 19 :** నిర్మల్ జిల్లా చలనచిత్ర, టీవీ అసోసియేషన్‌కు చెందిన కళాకారులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల.గణేష్ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ సమస్యలను మున్సిపల్ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కళాకారులకు ప్రభుత్వం ద్వారా పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర సంక్షేమ పథకాలు అందేలా సహకరించాలని కోరారు.



అలాగే కళాకారుల సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు నిర్మల్ జిల్లాలో ప్రత్యేకంగా కళాకారుల భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని వైస్ చైర్మన్ అప్పాల.గణేష్ చక్రవర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు కోటగిరి.నర్సయ్య చారి, ప్రధాన కార్యదర్శి తిరుక్కోవెల రవి, ఉపాధ్యక్షులు కమలాకర్, కోశాధికారి సామెర్ల రాజన్న, పడాల.మోహన్ రావు, బొందిడి పురుషోత్తం, కృష్ణ వర్మ, నరేందర్, అనిల్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

# మృత్యువుతో పోరాడి కన్నుమూసిన లక్ష్మీనారాయణ

**రియాద్, ఆగస్టు, 19 :** అన్నమయ్య జిల్లా రామాపురానికి చెందిన బి. లక్ష్మీనారాయణ సుమారు ఆరు నెలల క్రితం డ్రైవర్‌గా పనిచేయడానికి సౌదీ అరేబియాకు వచ్చారు.గత నెల 22వ తేదీన ఆయనకు ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో,ఆయన స్పాన్సర్ రియాద్‌లోని కింగ్ ఫహద్ మెడికల్ సిటీ (కె ఫ్ యం సి) ఆసుపత్రి లో చేర్పించారు. వైద్య పరీక్షల్లో ఆయన గుండె రక్తనాళాల్లో మూడు చోట్ల సుమారు 90 శాతం వరకు బ్లాకేజీలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో ఈ నెల3వ తేదీన ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు.అయితే శస్త్రచికిత్స అనంతరం ఆయన కిడ్నీలు పని చేయడం నిలిచిపోవడంతో కోమాలోకి వెళ్లిపోయారు. చికిత్సకు ఆయన శరీరం స్పందించడం లేదని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు.గత నెలరోజులుగా మృత్యువుతో తీవ్రంగా పోరాడిన లక్ష్మీ నారాయణ చివరకు కన్నుమూశారనే వార్త అత్యంత విషాదకరమని సాటా, టాసా,జీటీఎ,జీఐఎ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషాద సమయంలో కొన్ని అంశాలను ప్రస్తావించక తప్పదని సాటా,టాసా,జీటీఎ,జీఐఎ ప్రతినిధులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తులు తాము అధికార పార్టీ నాయకులమని,ఏపియన్ ఆర్ టి స్ కు సంబంధించిన వ్యక్తులమని చెప్పుకుంటూ,లక్ష్మీనారాయణ కు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన వ్యక్తులను బెదిరించడం, వ్యక్తిగత విమర్శలకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలను పలువురు తెలుగు ప్రజలు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు.ఇలాంటి అత్యంత విషాదకర పరిస్థితుల్లో కూడా రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం, మానవత్వం కంటే వ్యక్తిగత ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని వారు కోరారు.ఈ విషయమై టాసా (తెలుగు అసోసియేషన్ అఫ్ సౌదీ అరేబియా) వ్యవస్థాపక అధ్యక్షులు తిరుపతిస్వామి స్వర్ణ (స్వామి) గారు మాట్లాడుతూ,ఈరోజు ఉదయం సుమారు 10గంటల సమయంలో కె ఫ్ఎంసి ఆసుపత్రి నుంచి ఒక వైద్యుడు తనకు ఫోన్ చేసి, లక్ష్మీనారాయణ



పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, అత్యవసరంగా ఆసుపత్రికి రావాలని కోరారని తెలిపారు.వెంటనే ఆఫీసులో అనుమతి తీసుకుని ఆసుపత్రికి వెళ్లినట్లు స్వామి తెలిపారు.అయితే అప్పటికే వైద్యుల బృందం ఎంతగానో ప్రయత్నించినప్పటికీ లక్ష్మీనారాయణ గారిని కాపాడలేకపోయామని వైద్యులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రానికి చెందిన సామాజిక కార్యకర్త మహమ్మద్ షబ్బీర్ తో కలిసి లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఈ విషాద సమాచారాన్ని తెలియజేసినట్లు స్వామి గారు తెలిపారు. మహమ్మద్ షబ్బీర్ మొదటి నుంచి లక్ష్మీనారాయణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ, రాష్ట్రాలుగా విడిపోయినా మనమంతా తెలుగువారమే అనే మానవతా దృక్పథంతో ఆయన కుటుంబసభ్యులకు సహకరిస్తూ వచ్చారని పేర్కొన్నారు.అదే సమయంలో,వైయస్ఆర్‌సిపి నాయకుల ఆదేశాల మేరకు వైయస్ ఆర్ సి పి సౌదీ అరేబియా కన్వీనర్ రబ్బానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలో ఉండి కుటుంబ సభ్యులకు సహకరించడం అభినందనీ యమని పలు తెలుగు సంఘాల ప్రతినిధులు పార్టీలకు అతీతంగా కొనియాడారు. అయితే, లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉందని తెలిసినప్పటికీ, ఒక్క ఏపియన్ ఆర్‌టిసి కోఆర్డినేటర్ కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రికి వచ్చి కుటుంబ సభ్యులకు అండగా నిలవకపోవడం, మృతదేహాన్ని మార్చురీకి తరలించడం వంటి కీలక ప్రక్రియల్లో సహకరించకపోవడం ఎంతో బాధాకరమైన విషయమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే సమయం లో లక్ష్మీనారాయణ యజమాని బంధువు, ఆయనతో కలిసి పనిచేస్తున్న మరో డ్రైవర్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని, లక్ష్మీనారాయణ పరిస్థితి గురించి స్వామి, మహమ్మద్ షబ్బీర్ మరియు రబ్బానీ ను మరియు వైద్యులను కూడా అడిగి తెలుసు కున్నారని తెలిపారు. ఆ సమయంలో లక్ష్మీనారాయణ ఆర్థిక, కుటుంబ పరిస్థితులను యజమాని బంధువుకు వివరించి, వారి సహాయం కోరినట్లు స్వామి, మహమ్మద్ షబ్బీర్ మరియు రబ్బానీ తెలిపారు.దీనికి యజమాని కుటుంబం వెంటనే స్పందిస్తూ, “లక్ష్మీనారాయణ మా కుటుంబసభ్యుడి లాంటి వారు. మరోవైపు, కొందరు వ్యక్తులు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, తాము ప్రభుత్వ అధికారులమని, మరికొందరు తాము ఇండియన్ ఎంబసీ నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకుని, మృతదేహాన్ని భారత్‌కు పంపించే ప్రక్రియకు సంబంధించి తమ పేరుతో అఫిడవిట్ ఇవ్వాలని కోరినట్లు కుటుంబసభ్యులు తెలిపిన విషయం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి అత్యంత విషాద సమయంలో బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించాల్సింది పోయి, వ్యక్తిగత లేదా ప్రచార ప్రయోజనాలకు అవకాశం కల్పించడం అత్యంత విచారకరమని పలువురు పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృత్యువుతో పోరాడు తున్న సమయంలో 11 రోజులపాటు ఆయనను పరామర్శించడానికి రాని వ్యక్తులు, ఆయన మరణించిన విషయం తెలిసిన తరువాత కూడా సాయంత్రం వరకు ఆసుపత్రికి రాని వ్యక్తులు, ఇప్పుడు మృతదేహాన్ని భారత్‌కు పంపించే ప్రక్రియలో తమ పేరుతో అఫిడవిట్ ఇవ్వాలని కోరడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనే విషయాన్ని తెలుగు సమాజం,సామాజిక కార్యకర్తలు మరియు పలు తెలుగు సంఘాలు గమనిస్తున్నాయని పలువురు తెలిపారు.విషాద సమయంలో రాజకీయాలకు, వ్యక్తిగత ప్రచారానికి, స్వార్థ ప్రయోజనాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మానవత్వంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలవడమే నిజమైన సేవ; ఆ సేవకు రాజకీయ రంగు పులమడం మాత్రం సమంజసం కాదని పలువురు పేర్కొన్నారు.“మన తెలుగు వారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ఎలాంటి ఆపదలో ఉన్నా, విషయం తెలిసిన వెంటనే పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయం చేసేందుకు ముందుంటాం” అని సాటా రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చ తెలిపారు.లక్ష్మీనారాయణ ను మొదటగా పరామర్శించిన సాటా ప్రతినిధి సింగు నరేష్ కుమార్‌తో పాటు సాటా ప్రతినిధులు నూరుద్దీన్, కాజా ముజమ్మిల్ ఉద్దీన్, ముదిగొండ శంకర్, హైమద్ అబ్దుల్ కరీమ్, లోకేష్ కోకిల మరియు ఇతర సాటా ప్రతినిధులు కూడా ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు.అలాగే, లక్ష్మీనారాయణ విషయంలో తాము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులమని, ఏ పీ యస్ ఆర్ టి యస్ ప్రతినిధులమని చెప్పుకుంటూ శోకసముద్రంలో ఉన్న కుటుంబసభ్యులతో వ్యవహరించిన తీరుపై సౌదీ అరేబియాలోని పలు తెలుగు సంఘాలు, తెలుగు ప్రజలు మరియు సామాజిక కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు.ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్న నేపథ్యంలో, ఏ పీ యస్ ఆర్ టీ యస్ ద్వారా పెద్ద సంఖ్యలో కోఆర్డినేటర్లను నియమించినప్పటికీ, ఒక తెలుగు వ్యక్తి విదేశీ గడ్డపై ప్రాణాలతో పోరాడుతున్న సమయంలోనూ, అనంతరం మృతి చెందిన సమయంలోనూ ఆయనను పరామర్శించడానికి ఒక్క కోఆర్డినేటర్ కూడా సాయంత్రం వరకు ఆసుపత్రికి రాకపోవడం బాధాకరమైన విషయమని పలువురు తెలుగు ప్రజలు చర్చించుకుంటున్నారు.ప్రవాసాంధ్రుల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలు కేవలం పదవులు, హోదాలు, ప్రచారం కోసం కాకుండా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు ఉపయోగపడాలని తెలుగు ప్రజలు సూచిస్తున్నారు. లక్ష్మీనారాయణ మృతికి సాటా, టాసా, జి టి ఎ, జి ఐ ఎ ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,ప్రార్థించారు.

# జర్నలిస్టుల సమస్యపై మంత్రులు జోక్యం చేసుకోవాలి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి**
**-హుజూరాబాద్‌లో 4వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 19 :** హుజురాబాద్‌లో జర్నలిస్టుల నివాస స్థలాల విషయంలో మంత్రులు, కాంగ్రెస్ నేతలు వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టుల పొట్టకొట్టేలా అధికార పార్టీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని,కలం కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి హెచ్చరించారు. హుజూరాబాద్ పట్టణంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అడ్డుకుంటూ కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేసి వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరాన్ని సిపిఎం నేత వాసుదేవరెడ్డి సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్ ఆదేశాలు, ప్రభుత్వ జీవోలు, ఆర్డీవో, తహసీల్దార్ల సమక్షంలో నిబంధనల ప్రకారం అన్ని సర్వేలు పూర్తయ్యాకే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను నమ్ముకుని, తలదాచుకోవడానికి గూడు నిర్మించుకోవాలనే ఆశతో రూ.2నుంచి 3లక్షల వరకు అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్న జర్నలిస్టులను నేడు అన్యాయంగా కోర్టు కేసుల పేరుతో నట్టేట ముంచడం దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు 'ప్రజాపాలన' అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే నియంతృత్వ పోకడలతో జర్నలిస్టుల గొంతు నొక్కేందుకు సిద్ధపడటం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు.రాజకీయ పార్టీల మధ్య ఉండే కక్షలు,నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం కలం కార్మికుల హక్కులను బలిచేయాలని చూస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కేవలం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే బాధ్యత తీరిపోదని, జర్నలిస్టుల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బాధ్యతాయుతంగా అండగా నిలవాలని ఆయన స్పష్టం చేశారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు రోడ్డున పడి దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం, నాయకులు మౌనంగా ప్రేక్షక పాత్ర వహించడం తగదని వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ వొడితల ప్రణవ్ బాబు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తక్షణమే చొరవ చూపి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వేజ్ బోర్డు సిఫార్సులు, కనీస వేతన చట్టాలను అమలు చేసి జర్నలిస్టుల ఆర్థిక భద్రతను కాపాడాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే సీపీఎం శ్రేణులు ప్రత్యక్ష కార్యాచరణతో రోడ్డెక్కి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు, జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య,సీపీఎం నాయకులు,ప్రజా సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 19 :** జిల్లాలో భూముల రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. భూముల రీసర్వే ప్రక్రియ,వివిధ అంశాలపై తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు .జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా ఇప్పటి వరకు గంభీరావుపేట మండలం శ్రీనివాసపురం, కోనరావుపేట మండలం లచ్చపేట, వేములవాడ మండలం చంద్రగిరి,చందుర్తి మండలం అనంతపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వే పూర్తయిందని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రస్తుతం మరో పది గ్రామాల్లో సర్వే మొదలు పెట్టామని తెలిపారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే చేసిన గ్రామాలకు సంబంధించిన రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేయాలని ఆదేశించారు.మిగతా గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సూచించారు.భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని,రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని,రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు జీపీఓలు, ఏఈఓలు,పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఏ ఏ సర్వే నంబర్ భూముల సమాచారం ముందుగా ఆయా గ్రామాల్లో చేరవేయాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.అలాగే ప్రభుత్వ శాఖల భూముల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయాలని తెలిపారు. సర్వే కు సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల రహదారి విస్తరణకు ఆదిలోనే ఆటంకం

**-వెల్గటూర్ పాతనక్షా దారిని పునరుద్ధరించాలన్న రైతులు**
**-రెండవరోజు సర్వే అధికారులకు చుక్కెదురు**




**చురకలు,విలేఖరి,వెల్గటూర్, ఆగస్ట్ 19 :** జగిత్యాలజిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదా వరికి రాబోయే పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టనున్న ముందస్తుపనుల నిర్వాహణ లోభాగంగా రాష్ట్ర రహదారి పాశిగామ బస్సు స్టేజి నుండి కోటిలింగాల వెళ్లే రహదారి వై జంక్షన్ వరకు ప్రస్తుత మున్న రోడ్డును విస్తరించేందుకు 4కోట్ల నిధులు మంజూరికాగా విస్తరణ పనుల సర్వే కోసం బుధవారంవచ్చిన అధికారులను రెండవరోజు సైతం అడ్డుకున్నారు.రోడ్డు విస్తరణ చేపడితేతమ పట్టా భూములు నష్ట పోతామని,ఎట్టిపరిస్థితిలో భూములు ఇచ్చేది లేదని పాశిగామ రైతులు తేల్చి చెప్పారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే కోసం వచ్చినట్లు స్థానిక తహశీల్దార్ శేఖర్,సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు రైతులకు నచ్చ జెప్పే ప్రయత్నం చేసినప్పటికి వారు వినలేదు.ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణంలోభూములు కోల్పోయినామని ఉన్నకాస్త భూమిపోతే బ్రతకడం ఎలా అంటూఆవేదనవ్యక్తంచేశారు.వెల్గటూర్ ప్రస్తుతబస్సుస్టాండ్ ప్రక్కనుండి పాత నక్షా ప్రకారం రోడ్డుఉండేదని అది ఆక్రమణకు గురైందని అట్టి రహదారిని సర్వేచేసి పునరుద్ధరించాలని రైతులు అధికారులను కోరారు. అధికారులు చేసేదిలేక ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వెళ్లారు.

## కొండగట్టులో రెండు రోజులు అంతరాలయ దర్శనాలు రద్దు



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 19 :** శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం గర్భాలయ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు అంతరాలయ దర్శనాలను రద్దు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు.మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం ఆగస్టు 22న (శనివారం) నుంచి అంతరాలయ దర్శనాలు యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

## మంత్రుల సమక్షంలో అంబులెన్స్ ప్రారంభం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 19 :** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో వైకుంఠ రథాన్ని కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదెళ్ల శ్రీధర్ బాబు సి ఎస్ ఆర్ నిధులను 20 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది. దీంతో నూతనంగా కొనుగోలు చేసిన వైకుంఠ రథాన్ని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,మంత్రి శ్రీధర్ బాబు, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, మాజీ ఎంపీపీ కో లేటి మారుతి, ఉప సర్పంచులు సుహేల్, రాజమహేందర్, మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్,నాయకులు కిషన్ రెడ్డి, ఇనగంటి రామారావు, అంబిరి శ్రీనివాస్, పీట్ల గోపాల్,మల్యాల మహేష్ పాల్గొన్నారు.

## హుజురాబాద్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 19 :** హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ భవాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకటి నుండి మూడో తరగతి పిల్లల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లు, రూ. 3 వేల గ్రాంట్ వినియోగంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఆరోగ్యం, పరిశుభ్రత, జీవన నైపుణ్యాలపై కార్యక్రమాలు నిర్వహించడంపై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా అల్లి శ్రీనివాస్, తక్కలపల్లి శ్రీనివాస్ వ్యవహరించి ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు అందించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎఫ్ఎల్ యొక్క ప్రత్యేకత తెలిపే విధంగా పాఠశాల సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎఫ్ ఎల్ ఎన్ సెల్ఫీ పాయింట్ దగ్గర ఉపాధ్యాయులందరూ సెల్ఫీ దిగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమావేశంలో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**-మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను ప్రారంభించాలి**

**-డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలి**

**-అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అన్ని చర్యలు**

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు19 :** సర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధుల తో అన్ని స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి నుంచి వచ్చే అభిప్రాయాలు, క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన అనామలీస్ , మ్యాపింగ్ జరగని ఓటర్ల వివరాలను పరిశీలించాలని, సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. నోటీసులు జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టి, సంబంధిత ఓటర్లకు తమ వివరణను అందించే అవకాశం కల్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ కేసుల పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోటీసుల జారీ అనంతరం ఓటర్ల నుంచి అందే వివరణలు, సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 40,683 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు, 1,75,488 అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, జాబితా వివరాలను వారికి అందజేసి, వారి నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా జిల్లాలో అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బిఎస్. లత, ఆర్డీవోలు, తహసీల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "కలం" కార్మికులపై రాజకీయ కుట్రలా?

**-టీజేఎస్ రాష్ట్ర నేత ముక్కెర రాజు**

**-జర్నలిస్టుల దీక్షలకు మద్దతు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 19 :** ప్రజల కోసం నిరంతరం పనిచేసే కలం కార్మికులపై కాంగ్రెస్ నేతలు కక్షకట్టడం హేయమైన చర్య అని, ప్రజా సమస్యలను లేవనెత్తే జర్నలిస్టులు తమ న్యాయమైన హక్కుల కోసం నేడు రోడ్డెక్కి నిరసన తెలపాల్సి రావడం అత్యంత బాధాకరమని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లిన చరిత్ర జర్నలిస్టులదని, అలాంటి వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.హుజూరాబాద్ పట్టణంలో జర్నలిస్టుల నివేశన స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాల్గవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన ముక్కెర రాజు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని గుర్తు చేశారు.కుల సంఘాలకు స్థలాలు కేటాయించినప్పుడు లేని అభ్యంతరాలు,సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల విషయంలోనే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. జర్నలిస్టుల స్థలాలపై కోర్టులో ఉన్న కేసుల విషయంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వీడి, పటిష్టమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి ఆ కేసులు త్వరగా వీగిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అన్ని అనుమతులు, ఇంటి నంబర్లు, విద్యుత్ కనెక్షన్లు పొంది తాత్కాలిక ఇల్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు .జర్నలిస్టుల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పార్టీ, తాము అండగా ఉంటామని, అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, జర్నలిస్టులు,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య, ప్రొఫెసర్ శేఖర్, పాల్గొన్నారు.

# దేవుని గుట్టతండాలో ఘనంగా తీజ్ పండుగ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగస్టు 19 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్ట తండాలో గిరిజనులు తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. గోధుమలను తొమ్మిది రోజులు బుట్టలో నానబెట్టి, బుట్ట వద్ద ప్రతి రోజు సాయంత్రం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి సంతోషంగా నృత్యాలు చేశారు.తొమ్మిదో రోజు పూర్తయ్యే నాటికి మొలకల్లో కొన్నింటిని గిరిజన పెద్దల తలపాగాల్లో వేసి మిగిలినవాటిని సమీపంలోని చెరువులో వదిలారు. అనంతరం బుట్టలను తెచ్చిన యువతుల కాళ్లను వాళ్ల సోదరులు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత కళ్యాణ్నాయక్ గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా మహిళలకు 5000 రూపాయలు సహాయం అందజేశారు ఈ పండుగలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ ఒక గొప్ప కళ



**-మధుర జ్ఞాపకాలను పదిలపరిచే అద్భుత మాధ్యమం**

**-పత్రికల ఫోటోగ్రాఫర్లకు ఆత్మీయ సత్కారం చేసిన "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి**

**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు,19 :** ఫోటోగ్రఫీ ఒక గొప్ప కళ మాత్రమే కాకుండా, తరతరాలుగా కొనసాగుతున్న ఒక ప్రత్యేకమైన వృత్తి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ దినపత్రికల ఫోటోగ్రాఫర్లకు ఏర్పాటు చేసినటువంటి ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు అన్నారు. ఫోటోగ్రఫీ ద్వారా మధురానుభూతులను , మరపురాని జ్ఞాపకాలను జీవితాంతం పదిలపరుచుకోవచ్చని, సమాజంలో ఎన్నో మంచి మార్పులకు ఫోటోగ్రఫీ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోటోగ్రఫీకి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, కాలానుగుణంగా ఫోటోగ్రఫీలో అనేక సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా మలిచే దాని ప్రాధాన్యత మాత్రం ఎప్పటికీ తగ్గదని అన్నారు.ఒక మంచి ఛాయాచిత్రం ఒక సంఘటనను, ఒక భావోద్వేగాన్ని, భవిష్యత్ తరాలకు కళ్లకు కట్టినట్లు చూపించగలదని చెప్పారు. ఆత్మీయ సత్కారం పొందిన వారిలో సుకూర్ గారు, శైలేందర్ రెడ్డి , కిరణ్ , జనార్ధన్ గ, మోసిన్ , శ్రీధర్ , రంజిత్ మరియు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి పుణ్యస్నానాలు



**శ్రీ కోటేశుని ఆలయంలో భక్తుల సందడి**

**-వసతుల లేమితో భక్తుల ఇబ్బందులు**

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 19 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి పుణ్యస్నానాలతో పాటు కోటేశ్వరస్వామి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం పురస్కరించుకొని ఉదయం నుండే వివిధ ప్రాంతాలనుండి వాహనాల్లో కోటిలింగాలకుచేరుకున్నారు. గోదావరి స్నానగట్టాలు భక్తుల తోనిండిపోయాయి. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నిండుగా ఉన్న గోదావరి వద్ద భక్తులు లోతునీటిలోకి వెళ్ళ కుండా ఎలాంటి చర్యలులేవు.వర్షం వస్తే భక్తులు ఉండడానికి కనీసవసతిలేదు. శ్రావణమాసం అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా ఆలయ కార్య నిర్వాహనఅధికారిగాని, ఆలయ కమిటీ గాని, ఏ ఒక్క ఎండోమెంట్ సిబ్బంది కూడ ఆలయంలో లేకపోవడం విచారకరం.భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చినప్పుడు భక్తులు సమర్పించే కానుకలు హుండీలోవేసే విదంగా చర్యలు చేపట్టకపోతే హుండి ఆదాయం ఎలాపెరుగుతుంది.భక్తులఆధరణ పెరుగుతున్నా, ఆలయనిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలయ అభివృద్ధి కుంటు పడుతుందని భక్తులు వాపోతున్నారు.

